


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 26-11-2025 సంపుటి : 07 సంచిక 199 పేజీలు : 8 వెల : రూ 3-00


## త్యాగధనుల సంకల్పం నెరవేరింది



అయోధ్య: రామాలయ నిర్మాణం కోసం ఎందరో త్యాగాలు చేశారని, వారి ఆత్మలు ఈరోజు సంతోషంగా ఉంటాయని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఖీూ) చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. అయోధ్యలో బాలరాముడి ఆలయ శిఖరంపై ప్రధానమంత్రి మోదీతో కలిసి కాషాయ జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ, ఈరోజు ఎంతో శుభదినమని, ఈ క్షణాల కోసం, రామాలయ నిర్మాణం కోసం ఎందరో త్యాగాలు చేశారని, వారి ఆత్మలకు నేటితో శాంతి చేకూరిందని అన్నారు.'మహంత్ రాజచంద్ర దాస్ మహరాజ్, దాల్మియా (వీహెచ్‌పీ సీనియర్ నేత), అశోక్ (అశోక్ సింఘాల్) సహా అనేక మంది సాధువులు, విద్యార్థులు, అన్నిరంగాలకు చెందిన ప్రజలు ప్రాణత్యాగాలు చేశారు. ఆలయ నిర్మాణం కోసం వారు కన్న కలలు నేటికి ఫలించాయి' అని మోహన్ భాగవత్ అన్నారు. ఈరోజుతో ఆలయ శాస్త్రీయ ప్రక్రియ పూర్తయిందని, ధ్వజారోహణ నిర్వహించుకున్నామని పేర్కొన్నారు.రామాలయకోసం 500 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం కాషాయ జెండా, భగవద్ధ్వజం, ధర్మధ్వజం ఈరోజు ఆలయ శిఖరంపై ఆవిష్కృతమైందని మోహన్ భాగవత్ అన్నారు. హిందువులు తమ సత్వగుణాన్ని 500 ఏళ్లుగా చాటుకుంటూ వచ్చారని, ఎట్టకేలకు రామ్‌లల్లా మందిర నిర్మాణం జరిగి బాలరాముడు మన కళ్లముందు ఉన్నారని అన్నారు. సత్యం, ధర్మానికి రామాలయం ప్రతీక అని పేర్కొన్నారు. మన పూర్వీకులు మనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు చెప్పుకునే రోజు ఇదని అన్నారు. ఈదేశంలో పుట్టిన వారంతా మన పెద్దసోదరులని, ఎన్నో అంచనాలతో ప్రపంచం మనవైపు చూస్తోందని, వాటిని సాకారం చేయాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. రామాలయ శిఖరంపై ధ్వజారోహణ కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనందిబెన్ పటేల్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తదితరులు పాల్గొన్నారు


## రామభక్తుల సంకల్పం సిద్ధించింది: ప్రధాని మోదీ



లక్నో, నవంబర్ 25: భారతీయ సాంస్కృతిక చైతన్యానికి సాక్షిగా అయోధ్య నిలిచిందని దేశ ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. మంగళవారం బాలరాముడి ఆలయ శిఖరంపై జెండాను ఎగురవేసిన అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించారు. జై శ్రీరామ్ నినాదంతో ప్రధాని మోదీ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. రామభక్తుల సంకల్పం సిద్ధించిందన్నారు. రామాలయ నిర్మాణ యజ్ఞానికి నేడు పూర్ణాహుతి జరిగిందని చెప్పారు.ధర్మ ధ్వజం కేవలం జెండా కాదని..భారత సంస్కృతి పునర్వికాసానికి చిహ్నమని ప్రధాని మోదీ అభివర్ణించారు. సంకల్పం, సఫలతకు ఈ ధ్వజం చిహ్నమని పేర్కొన్నారు. ధర్మ ధ్వజం శ్రీరాముడి సిద్ధాంతాలను ప్రపంచానికి చాటుతుందన్నారు. ధర్మ ధ్వజం ప్రపంచానికి ఒక స్ఫూర్తి, ప్రేరణ ఇస్తుందని స్పష్టం చేశారు. కర్మ,కర్తవ్యాల ప్రాముఖ్యాన్ని ధర్మ ధ్వజం వివరిస్తుందన్నారు. పేదలు,దుఃఖితులు లేని సమాజాన్ని మనం ఆకాంక్షిస్తున్నామని ప్రధాని మోదీ తెలిపారు. ఈ ధ్వజారోహణ కార్యక్రమంతో శతాబ్దాల నాటి గాయాలు మానిపోయాయన్నారు. ఒక వ్యక్తి పురుషోత్తముడిగా ఎలా ఎదిగారో అయోధ్య చెబుతుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

## బంగాళాఖాతంలో వాయుగుండం

## ఏపీలో 29 నుంచి వర్షాలు..



నైరుతి బంగాళఖాతం, దక్షిణ శ్రీలంక సమీపంలో ఉపరితల ఆవర్తనం అల్ప పీడనంగా మారింది. ఈ అల్ప పీడనం ఉత్తర వాయువ్య దిశగా ప్రయాణించి మరింత బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని విశాఖపట్నం తుఫాను హెచ్చరికల కేంద్రం అధికారి తెలిపారు. దీని ప్రభావంతో దక్షిణ కోస్తా ప్రాంతంలో విస్తారంగా వర్షాలు పడే అవకాశాలున్నాయన్నారు. గురువారం నుంచి మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని విపత్తుల నిర్వహణ శాఖ హెచ్చరించింది మరోవైపు దక్షిణ అండమాన్, మలక్కా జలసంధి వద్ద ఏర్పడిన ఆల్పపీడనం వాయుగుండంగా మారింది. అండమాన్ ప్రాంతానికి 750 కిలోమీటర్ల దూరంలో ఈ వాయుగుండం కొనసాగుతోంది. రాబోయే రెండురోజుల్లో పశ్చిమ వాయువ్య దిశగా పయనించి, మరింతగా బలపడుతుంది. దీని ప్రభావంతో నవంబర్ 29 నుంచి డిసెంబర్ 2వ తేద వరకు కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు విశాఖపట్నం తుఫాను హెచ్చరికల కేంద్రం తెలిపింది ప్రస్తుతం ఈ వాయుగుండం మలేసియాలోని జార్జ్‌టౌన్‌కు 70 కి.మీ. దూరంలోనూ, ఇండోనేసియాలోని కుటామక్మూర్‌కు 290 కి.మీ. దూరంలోనూ, అండమాన్ నికోబార్ దీవులకు 750 కి.మీ. దూరంలోనూ కేంద్రీకృతమై ఉంది. తాజా పరిస్థితుల నేపథ్యంలో రైతులు అప్రమత్తమై వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

## రాయలసీమలో ఉద్యాన పంటల అభివృద్ధిపై సర్కార్ ఫోకస్



అమరావతి, నవంబర్ 25: రాయలసీమలో హార్టికల్చర్ పంటల సాగుకు సబ్సిడీలు, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్‌తో చేయూతను ఇచ్చే అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఉద్యానవన పంటల ద్వారా రాయలసీమ రైతుల ఆదాయం పెంచేందుకు ప్రణాళిక అమలుపై మంత్రులు, అధికారులతో సీఎం సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన పూర్వోదయ పథకంలో భాగంగా రాయలసీమలో ఉద్యాన పంటల అభివృద్ధిపై సమావేశంలో చర్చించారు. రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో 92 క్లస్టర్ల ద్వారా హార్టికల్చర్ సాగును ప్రోత్సహించేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది.5.98 లక్షల మంది ఉద్యాన రైతులకు మరింత లబ్ధి కలిగేలా ప్రణాళికను సిద్ధం చేస్తోంది. డ్రిప్, సాగునీరు, రవాణా, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పంచాయతీ రాజ్ రోడ్లు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, గోడౌన్లు, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించం ద్వారా హార్టికల్చర్ రైతుల ఆదాయం పెంచేందుకు చర్యలు చేపట్టింది. మారుతున్న ఆహారపు అలవాట్లు, డిమాండ్ ఉన్న పంటల సాగు, టెక్నాలజీ వాడకం వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని హార్టికల్చర్ పంటలకు ప్రోత్సాహం కల్పించే దిశగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ సమావేశానికి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## తెలంగాణ పంచాయతీ ఎన్నికల ఉత్కంఠకు తెర




హైదరాబాద్: తెలంగాణ పంచాయతీ ఎన్నికల ఉత్కంఠకు తెరపడింది. తెలంగాణ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ ఖరారైంది. ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేయనుంది. ఈ మేరకు సాయంత్రం 6:15 గంటలకు మీడియా సమావేశం నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్ తెలిపింది. ఈ మీడియా సమావేశంలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల షెడ్యూల్‌ను రిలీజ్ చేయనున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచే రూరల్‌లోని 545 మండలాలు, 12733 గ్రామాల్లో ఎన్నికల కోడ్ అమలులోకి రానుంది.డిసెంబర్‌లో మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లను పూర్తి చేసింది. ఎన్నికల సిబ్బంది ఎంపిక, పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లను కూడా పూర్తి చేసింది. అందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ఈరోజు సాయంత్రం 6:15 గంటలకు ఈసీ విడుదల చేయనుంది.

## లిక్కర్ స్కామ్‌లో.. జోగి రమేష్‌కు పోలీస్ కస్టడీ..

నకిలీ మద్యం కేసులో వైసీపీ నేత జోగి రమేష్‌ను పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. రేపటి నుంచి 4 రోజుల పాటు కస్టడీకి ఇస్తూ ఎక్సైజ్ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఈ కేసులో జోగి రమేష్‌ను పోలీసులు ప్రశ్నించనున్నారు.ఈ కేసులో ఏ1గా ఉన్న అద్దేపల్లి జనార్దన్ రావు, ఏ2గా ఉన్న అద్దేపల్లి జగన్‌మోహన్ రావు కీలకంగా వ్యవహరించినట్లు పోలీసులు నిర్ధారించారు. అయితే మొదటి నుంచి ఈ వ్యవహారం వెనుక జోగి రమేష్ ఉన్నారని, ఆయన సమక్షంలో లక్షల రూపాయల లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. దీనిపై అధికారులు ఇప్పటికే అద్దేపల్లి బ్రదర్స్‌ను రెండు సార్లు విచారించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఈ స్కామ్‌లో జోగి రమేష్ పాత్రపై జనార్దన్ రావు, జగన్‌మోహన్ రావు ఇచ్చిన వాంగ్మూలాలను రికార్డ్ చేశారు. ఈ పరిణామల నేపథ్యంలో జోగి రమేష్‌ను 10 రోజుల పాటు కస్టడీ కోరుతూ ఎక్సైజ్ కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. విచారించిన న్యాయస్థానం 4 రోజుల పాటు విచారించేందుకు అనుమతి ఇచ్చింది.ఏపీ లిక్కర్ స్కామ్‌లో జోగి రమేష్ కీలకంగా వ్యవహరించినట్లు పోలీసులు గుర్తించిన విషయం తెలిసిందే. ఏపీ ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేందుకు జోగి రమేష్ నకిలీ మద్యం గురించి వార్తలను లీక్ చేసినట్లు తేలింది. దీంతో పోలీసులు దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేశారు. జోగి రమేష్ నకిలీ మద్యం తయారీకి ఆదేశించారని, ఆ సమాచారాన్ని వైసీపీ మీడియాకు లీక్ చేశారని అధికారులు నిర్ధారించారు. జోగి రమేష్ సూచనల మేరకే తాము నకిలీ మద్యం తయారు చేసినట్లు జనార్దన్ రావు పోలీసుల ముందు అంగీకరించిన విషయం తెలిసిందే.






# సంపాదకీయం

బుధవారం 26-11-2025

## రాజ్యాంగంలో భారతీయతపై చర్చ

భారత రాజ్యాంగం, జాతీయ జెండా, కులవ్యవస్థపై రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అభిప్రాయాలపై ఎప్పుడూ విమర్శలు వినిపిస్తూనే ఉంటాయి. ఈ మూడు ప్రధాన అంశాలపై స్వాతంత్ర్యం నుంచి ఇప్పటిదాకా అనేక సందర్భాల్లో ఆర్ఎస్ఎస్ చాలాసార్లు తన అభిప్రాయాలు మార్చుకుంది. "అనేక పశ్చిమ దేశాల రాజ్యాంగాల నుంచి అనేక విషయాలు తీసుకుని వైవిధ్యభరితంగా మన రాజ్యాంగం రూపొందించారు. దాంట్లో మన సొంతం అని పిలవడానికి ఏదీ లేదు. మన జాతీయ లక్ష్యానికి సంబంధించి, మన జీవితాల్లోని ప్రాధాన్యాలకు సంబంధించి ఒక్క పదమన్నా అదులో ఉందా? లేదు.." అని 'బంచ్ ఆఫ్ థాట్స్' పుస్తకంలో సంఘ్ రెండో అధ్యక్షుడు మాధవ్ సదాశివరావ్ గోల్‌వాల్కర్ రాశారు"రేపు అధికారం చేపట్టబోతున్నవాళ్లు మన చేతుల్లో త్రివర్ణజెండా ఉంచుతారు. కానీ దాన్ని హిందువులు ఎప్పుడూ గౌరవించరు, తమ సొంతంగా భావించరు. మూడు అనే పదం మంచిది కాదు. మూడు రంగులతో ఉండే జెండా మానసికంగా చాలా తీవ్రమైన చెడు ప్రభావం చూపుతుంది. దేశానికి ప్రమాదకరమైనది" అని భారత్‌కు స్వాతంత్ర్యం రావడానికి ఒకరోజు ముందు 1947 ఆగస్టు 14న తన పత్రిక ఆర్గనైజర్‌లో ఆర్ఎస్ఎస్ రాసిన వ్యాఖ్యలను చాలామంది విమర్శిస్తుంటారు. ఆర్ఎస్ఎస్ భారత రాజ్యాంగాన్ని తిరస్కరించిందని ప్రముఖ లాయర్, రాజకీయ వ్యాఖ్యాత ఏజీ నురానీ 'ది ఆర్ఎస్ఎస్: దేశానికి ప్రమాదం' అనే తన పుస్తకంలో రాశారు. ఏజీ నురానీ బాంబే హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో పనిచేశారు."రాజ్యాంగాన్ని హిందూ వ్యతిరేకమైనదిగా పేర్కొంటూ, దేశంలో తాము ఎలాంటి రాజకీయం కోరుకుంటున్నామో తెలియజేస్తూ 1993 జనవరి 1న సంఘ్ శ్వేతపత్రం ప్రచురించింది. భారత్ సమగ్రతను, సోదరభావాన్ని, మతపరమైన సౌభ్రాతృత్వాన్ని దెబ్బతీసింది ఎవరు? ఆకలి చావులకు, నిరుద్యోగితకు, అవినీతికి, మతపరమైన అసహనానికి కారణం ఎవరు? దీనికి సమాధానం 'భారత ప్రస్తుత రాజ్యాంగం' అనే శ్వేతపత్రంలో ఉంది" అని నురానీ రాశారు. 1992 డిసెంబరు 6న బాబ్రీ మసీదు విధ్వంసం జరిగిన కొన్ని రోజుల తర్వాత ఈ శ్వేతపత్రం ప్రచురితమైంది."ప్రస్తుత రాజ్యాంగం దేశ సంస్కృతి, స్వభావం, పరిస్థితులు మొదలైన వాటికి విరుద్ధంగా ఉంది. దీనిపై ఇతర దేశాల ప్రభావం ఎక్కువగా ఉంది. ప్రస్తుత రాజ్యాంగాన్ని రద్దు చేసిన తర్వాతే మన ఆర్థిక విధానం, న్యాయ, పరిపాలనా నిర్మాణం, ఇతర జాతీయ సంస్థల గురించి మనం కొత్తగా ఆలోచించాల్సి ఉంటుంది" అని శ్వేతపత్రం పీఠికలో స్వామి హిరానంద్ రాసినట్టు నురానీ చెప్పారు. రాజ్యాంగంలో మార్పులు చేయాల్సిన అవసరం ఉందని, భవిష్యత్తులో ఈ దేశం నీతి, ప్రతిభకు అనుగుణంగా రాజ్యాంగాన్ని స్వీకరించాలని 1993 జనవరిలో అప్పటి ఆర్ఎస్ఎస్ చీఫ్ రాజేంద్ర సింగ్ రాశారని తన పుస్తకంలో నురానీ పేర్కొన్నారు. 1993 జనవరి 24న అప్పటి బీజేపీ అధ్యక్షుడు మురళీ మనోహర్ జోషి కూడా రాజ్యాంగాన్ని కొత్తగా పరిశీలించాలనే డిమాండ్‌ను ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురంలో పునరుద్ఘాటించారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు, కొంతమంది బీజేపీ నేతలు 'అబ్‌కి బార్ 400 పార్' (ఈసారి మేము 400 దాటతాం)అన్న నినాదం నిజమైతే...అది రాజ్యాంగాన్ని మారుస్తుందని ప్రకటనలు చేయడం ప్రారంభించారు. అలా చేయాలనే ఉద్దేశం లేదని బీజేపీ చాలాసార్లు స్పష్టం చేసినప్పటికీ, రాజ్యాంగంలో భారీగా ప్రాథమిక మార్పులు చేయడానికి పార్టీ ప్రయత్నించిన ఉదాహరణలు ఉన్నాయిఅటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానిగా ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడినప్పుడు, వారు చేసిన మొదటి పని రాజ్యాంగాన్ని సమీక్షించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయడం. చాలా గందరగోళం చెలరేగిన తర్వాత వారు కమిటీ ఏర్పాటుకు గల కారణాన్ని మార్చారు. రాజ్యాంగాన్ని పూర్తిగా సమీక్షించడానికి బదులుగా, ఇప్పటివరకు రాజ్యాంగం ఎలా పనిచేసిందో కమిటీ పరిశీలిస్తుందని చెప్పారు" అని నీలాంజన్ ముఖోపాధ్యాయ్ తెలిపారు. వాజ్‌పేయి ప్రభుత్వంలో రాజ్యాంగాన్ని సమీక్షించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేశారని, ప్రస్తుత రాజ్యాంగం స్థానంలో కొత్త రాజ్యాంగం ఉండాలని ఆర్ఎస్ఎస్, బీజేపీ భావించాయని ముఖోపాధ్యాయ్ తెలిపారు. నరేంద్ర మోదీ మాత్రం 2014లో ప్రధాని అయిన వెంటనే రాజ్యాంగం భారతదేశంలోని ఏకైక పవిత్ర గ్రంథం అని, పార్లమెంటును ప్రజాస్వామ్య దేవాలయం అని పిలవడం ప్రారంభించారు"ఈ రాజ్యాంగాన్ని మన ప్రజలు తయారుచేశారు. రాజ్యాంగం మన దేశ ఏకాభిప్రాయం. కాబట్టి రాజ్యాంగాన్ని క్రమశిక్షణగా అనుసరించడం ప్రతి ఒక్కరి కర్తవ్యం. ఆర్ఎస్ఎస్ ఇప్పటికే దీన్ని విశ్వసిస్తోంది. స్వతంత్ర భారతదేశం అన్ని చిహ్నాలను, రాజ్యాంగ స్ఫూర్తిని మేము పూర్తిగా గౌరవిస్తూనే ఉన్నాం" అని ఆర్ఎస్ఎస్ అధ్యక్షుడు మోహన్ భగవత్ 2018లో దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మాట్లాడుతూ అన్నారు. బద్రీ నారాయణ్ ఒక సామాజిక చరిత్రకారుడు, సాంస్కృతిక శాస్త్రవేత్త. ఆయన ప్రస్తుతం అలహాబాద్‌లోని గోవింద్ వల్లభ్ పంత్ సోషల్ సైన్స్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు."రాజ్యాంగాన్ని పూర్తిగా గౌరవిస్తున్నామని, రాజ్యాంగంతో ఉన్నామని, రాజ్యాంగ విలువలను విశ్వసిస్తున్నామని కొన్నేళ్లగా ఆర్ఎస్ఎస్ స్పష్టం చేస్తోంది. వివా దాలు సృష్టించాలనుకునేవారు ఏ విషయాన్నయినా లేవెనెత్తవచ్చు. అన్నింటిలో రాజకీయాలు చూడొచ్చు. మోహన్ భగవత్ లేదా ఆయన కంటే ముందు బాలాసాహెబ్ డియోరాస్ చేసిన ఆర్ఎస్ఎస్ ప్రకటనలను మీరు గమనిస్తే, ఆర్ఎస్ఎస్ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని విశ్వసిస్తోందని స్పష్టంగా తెలుస్తుంది" అని నారాయణ్ అన్నారు. ఆర్ఎస్ఎస్‌కు రాజ్యాంగంతో లోతైన అనుబంధం ఉందని, రాజ్యాంగానికి సంబంధించి గత రెండు దశాబ్దాలుగా ఆర్ఎస్ఎస్ వైఖరి రాజ్యాంగానికి అనుకూలంగా ఉందని, అందులో ఎలాంటి వైరుధ్యం లేదని ప్రొఫెసర్ బద్రీ నారాయణ్ చెప్పారు. భారత పార్లమెంటు రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు అయిన సందర్భంగా డిసెంబర్ 2024లో జరిగిన వేడుకలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ రాజ్యాంగం, మనుస్మృతి అంశంపై హిందుత్వ సిద్ధాంతకర్త వి. రచనలను ఉదహరించడం ద్వారా బీజేపీని లక్ష్యంగా చేసుకున్నారు.

## పూర్వ ప్రాథమిక విద్యను పటిష్టంగా అమలు చేయాలి : కలెక్టర్ జితేష్ వి పాటిల్

రామవరం, నవంబర్ 25 : పూర్వ ప్రాథమిక విద్యను పటిష్టంగా అమలు చేయుటలో టీచర్ల పాత్ర కీలకమని, పూర్వ ప్రాథమిక విద్యలో చేరిన పిల్లలకు ఆటపాటలను పరిచయం చేస్తూ సాధ్యమైనంతగా అక్షర, గణిత జ్ఞానాన్ని అందించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. జిల్లాలో నూతనంగా ఏర్పాటు అయిన 24 ప్రీ ప్రైమరీ పాఠశాలల ఉపాధ్యాయులకు కొత్తగూడెంలోని జిల్లా విద్యా శిక్షణ కేంద్రంలో నేటి నుండి ఐదు




రోజుల పాటు జరిగే శిక్షణా కార్యక్రమాన్నిఆయన ప్రారంభించి మాట్లాడారు. పిల్లలకు మంచి వాతావరణంలో తరగతి గదులను ఏర్పాటు చేసి, వారి ఆటపాటలకు అనువైన వస్తువులను కూడా సమకూరుస్తామని తెలిపారు. ఉపాధ్యాయులుగా ఎన్నికైన వారు పిల్లల పట్ల తల్లి ప్రేమను చూపించి వారి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ పిల్లలే రేపటి ప్రాథమిక పాఠశాలలో చేరిన తర్వాత మంచి అభ్యసన సామర్థ్యాలు కలిగి ఉంటారన్నారు. పూర్వ ప్రాథమిక విద్య పటిష్టంగా అందించినప్పుడు వారికి విద్య పట్ల ఆసక్తి కలిగి ఉన్నత విద్యావంతులుగా తయారవుతారన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి బి.నాగలక్ష్మి మాట్లాడుతూ.. ఉన్నత విద్యావంతులు చాలామంది పూర్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా ఎన్నికవడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేశారు. వీరి జ్ఞానాన్ని పిల్లల అభివృద్ధికి ఉపయోగించి మంచి పౌరులను తయారు చేయాలని ఉద్బోధించారు. అనంతరం ప్రీ ప్రైమరీ విద్యార్థుల కోసం రూపొందించిన వీడియోను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఏ.నాగరాజశేఖర్, రిసోర్స్ పర్సన్లు డాక్టర్ రాజశేఖర్, స్వరూప్ కుమార్, శ్రీశైలం, సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్ సభ్యులు నందకిషోర్, కార్తీక్, అల్లూరి పాల్గొన్నారు.

## మల్లికార్జున్ ఖర్గేతో డీకే శివకుమార్ కీలక భేటీ..! సీఎం పదవిపైనే చర్చలా..?

న్యూఢిల్లీ: కర్నాటకలో ముఖ్యమంత్రి మార్పుపై ఇంకా ఉత్కంఠ కొనసాగుతున్నది. సీఎం సిద్ధరామయ్య తర్వాత డీకే శివకుమార్ మంగళవారం బెంగళూరులో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో సమావేశమయ్యారు. పార్టీ అధ్యక్షుడు ఖర్గే ఢిల్లీకి బయలుదేరే ముందు ఈ సమావేశం జరిగిందని సంబంధిత వర్గాలు తెలిపాయి. సమావేశం తర్వాత ఇద్దరూ ఒకే కారులో విమానాశ్రయానికి




వెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన ఐదేళ్ల పదవీకాలంలో సగం పూర్తయ్యింది. దాంతో ముఖ్యమంత్రి మార్పుపై ఊహాగానాలు తీవ్రమయ్యాయి. ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు తర్వాత సిద్ధరామయ్య, శివకుమార్ మధ్య రెండున్నరేళ్ల పాటు పదవిలో కొనసాగాలని ఒప్పందం చేసుకున్నట్లుగా వార్తలు వచ్చాయి.రాబోయే రెండున్నరేళ్ల పాటు డీకే శివకుమార్ సీఎం పదవి చేపడుతారా? అన్న చర్చలు సాగుతున్నాయి. సోమవారం ఖర్గేతో సమావేశం అనంతరం సిద్ధరామయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయానికి తాను కట్టుబడి ఉంటానని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. 'కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయానికి కట్టుబడి ఉంటుంది. ఏ నిర్ణయం తీసుకున్నా నేను దాన్ని అంగీకరించాలి. శివకుమార్ అలాగే చేయాలి' అని పేర్కొన్నారు. అయితే, శివకుమార్ ముఖ్యమంత్రి అవుతారా? అన్న ప్రశ్నకు స్పందిస్తూ.. హైకమాండ్ నిర్ణయం తీసుకుంటుందని పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ అధిష్టానం మంత్రివర్గ పునర్వ్యస్థీకరణకు కొద్ది నెలల కిందట అంగీకారం తెలిపింది. కానీ ప్రభుత్వం రెండున్నరేళ్లు పూర్తి చేసుకున్న తర్వాత మార్పు జరుగుతుందని తెలిపారు. హైకమాండ్ నిర్ణయించిందే చెల్లుబాటు అవుతుందన్నారు.అయితే, గతవారం డీకే శివకుమార్ మద్దతు ఇస్తున్న కొందరు ఎమ్మెల్యేలు ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో సమావేశమయ్యారు. సిద్ధరామయ్య బెంగళూరులో ఖర్గేతో గంటకుపైగా సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ కోరుకుంటున్నారని.. శివకుమార్‌కు సీఎం పదవిపై నిర్ణయం తీసుకోవాలని కోరుకుంటున్నారని సంబంధిత వర్గాలు సూచిస్తున్నాయి. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు హైకమాండ్ ఆమోదం తెలిపితే.. సిద్ధరామయ్య తన ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకున్నట్లు అవుతుంది. దాంతో శివకుమార్ సీఎం అయ్యే అవకాశాలు తగ్గుతాయి. శివకుమార్‌కు మద్దతుగా ఇటీవల మరో ఆరుగురు ఎమ్మెల్యేలు ఢిల్లీకి వెళ్లారని, త్వరలోనే మరికొందరు ఎమ్మెల్యేలు అధిష్టాన్ని కలిసే అవకాశం ఉందని భావిస్తున్నారు. శివకుమార్‌ను సీఎంగా నియమించాలనే తమ డిమాండ్‌ను ఎమ్మెల్యేలు హైకమాండ్ దృష్టికి తీసుకెళ్లనున్నారు.

## 'కొత్త లేబర్ కోడ్స్‌ను రద్దు చేసి పాత చట్టాలనే కొనసాగించాలి'

### ముక్త కంఠంతో నినదించిన సింగరేణి కార్మిక సంఘాలు

### నాలుగు లేబర్ కోడ్స్ పత్రాల కాల్చివేత

రామవరం, నవంబర్ 25 : కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను తొలగించి, 4 చట్ట స్వభావం లేని కోడ్స్‌గా మార్చడాన్ని సింగరేణి కార్మిక సంఘాలన్నీ ముక్తకంఠంతో వ్యతిరేకించాయి. కొత్త కోడ్స్ ను రద్దు చేసి పాత 29 చట్టాలనే కొనసాగించాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కేంద్రం తీసుకువస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కార్మిక సంఘాలన్నీ ధర్నాలు, ఆందోళనలు, సమ్మెలు చేసినా కేంద్రం పెడచెవిన పెడుతుందని దుయ్యబట్టారు. కార్పొరేట్ కంపెనీలు, పెట్టుబడిదారుల కోసమే కేంద్రం పని చేస్తుందని ఆరోపించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నాలుగు లేబర్ కోడ్ లను అనుమతించమని, వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష యూనియన్ల ఆధ్వర్యంలో మంగళవారం కొత్తగూడెం ఏరియాలోని వెంకటేష్ ఖనీ కోల్ మైన్ లో నాలుగు లేబర్ కోడ్స్ పత్రాలను తగలబెట్టారు. అనంతరం మేనేజర్ మురళికి మెమోరాండం అందజేశారు. అన్ని గనుల డిపార్ట్‌మెంట్లలో నల్ల బ్యాడ్జీలతో నిరసనలు తెలిపారు. ఈ నెల 26 ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టర్లకు మెమోరాండంలు ఇవ్వడం, అదే రోజు సాయంత్రం 3.30కి సింగరేణి వ్యాప్తంగా అన్ని జీఎం కార్యాలయాల ముందు ధర్నా కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమాలకు అన్ని సంఘాల కార్యకర్తలు, నాయకులు, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, సీఐటీయూ, టీబీజీకేఎస్ ముఖ్య నాయకులు టిబిజికెఎస్ చీఫ్



జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ, ఏఐటీయూసీ నాయకులు పిట్ సెక్రటరీ ఏం ఆర్ కే ప్రసాద్, కొత్తగూడెం ఏరియా ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ రజాక్, సిఐటియు నాయకులు శ్రీరామ్మూర్తి ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, టీబీజీకేఎస్ ముఖ్య నాయకులు గడప రాజయ్య, గోపు కుమార్, విప్లవ కుమార్, హీరోలాల్, విజయ్, జిఎస్ శ్రీనివాస్, ఆంజనేయులు, వసంత్, మంగన్ రవి, రాజ్ కుమార్, సంతోష్ పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ఆర్ఓలకు శిక్షణ



కారేపల్లి, నవంబర్ 25 : పంచాయతీ ఎన్నికలను సమర్థంగా నిర్వహించడంలో రిటర్నింగ్ అధికారులు కీలకపాత్ర పోషిస్తారని ఖమ్మం జిల్లా కారేపల్లి మండల ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలో గల ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం రిటర్నింగ్ అధికారులకు మాస్టర్ ట్రైనింగ్ రాజేశ్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. రిటర్నింగ్ అధికారులకు సహాయ రిటర్నింగ్ అధికారులు సహకరిస్తుంటారని, మండలంలో 13 క్లస్టర్లకు గాను 13 మంది రిటర్నింగ్ అధికారులు నామినేషన్ల ప్రక్రియ, 41 గ్రామ పంచాయతీలకు 41 మంది సహాయ రిటర్నింగ్ అధికారులు ఎన్నికల ప్రక్రియను నిర్వహిస్తారని తెలిపారు. కాబట్టి వీరికి ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇవ్వాలని ఎన్నికల సంఘం నిర్ణయించిందని చెప్పారు. ఈ శిక్షణలో భాగంగా పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నియమ నిబంధనలపై పూర్తిస్థాయిలో మాస్టర్ ట్రైనీలు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. సింగరేణి మండలంలో 45,411 మంది ఓటర్లు ఉండగా 356 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మూడో విడుతలో మండలంలో ఎన్నికలు ఉండవచ్చని నోటిఫికేషన్ విడుదలైన తర్వాత సమగ్ర వివరాలతో కూడిన సామగ్రిని రిటర్నింగ్ అధికారులకు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ రమేశ్, ఎంఈఓ జయరాజ్, ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్, ఎంపీడీఓ కార్యాలయం సూపరింటెండెంట్ రమేశ్ పాల్గొన్నారు.

## బీహార్ ఎన్నికల్లో ఓటమి.. ఏడుగురు కాంగ్రెస్ నాయకులపై వేటు




బీహార్ అసెంబ్లీ ఎన్నికల లో ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్న కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఆత్మవిమర్శ చేసుకుంటోంది. పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా వ్యవహరించారనే కారణంతో ఏడుగురు సీనియర్ నాయకులపై వేటువేసింది. ఆరేళ్లపాటు వారి ప్రాథమిక సభ్యత్వాన్ని కూడా రద్దుచేసింది.పార్టీ క్రమశిక్షణ కమిటీ సమీక్ష చేసిన అనంతరం ఈ నిర్ణయం తీసుకుంది. వేటుపడిన వారిలో పార్టీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఆదిత్య పాశ్వాన్, మరో మాజీ ఉపాధ్యక్షుడు షకీల్ ఉర్ రెహమాన్, కిసాన్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాజ్‌కుమార్ శర్మ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజ్ కుమార్ రంజన్, మరో మాజీ అధ్యక్షుడు కుందన్ గుప్తా, బంకా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాంచన కుమారి, నలంద జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు రవి గోల్డెన్ ఉన్నారు. పై ఏడుగురు నేతలు తరచూ మీడియాలో పార్టీ వ్యతిరేక వ్యాఖ్యలు చేసినట్లు క్రమశిక్షణ కమిటీ తేల్చింది. ఆ ఏడుగురు నేతల నుంచి వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు ఇచ్చామని, అయినా ఆ నోటీసులకు వారు సంతృప్తికరమైన వివరణ ఇవ్వలేదని, దాంతో బహిష్కరణ వేటు వేశామని తెలిపింది.

## జనవరి, ఫిబ్రవరిలో పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు

కాజీపేట, నవంబర్ 25 : రైల్వేశాఖ సికింద్రాబాద్ రైల్వే డివిజన్ పరిధిలోని కాజీపేట రైల్వే జంక్షన్ బలార్షా సెక్షన్లో వచ్చే ఏడాది (2026) జనవరి, ఫిబ్రవరి రెండు నెలలలో 22న రోజుల పాటు అన్ని ప్రయాణికుల రైళ్లను రద్దు, దారి మళ్లించి నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. సెక్షన్‌లోని మందమర్రి రైల్వేస్టేషన్లో జరగనున్న మూడో లైన్ నాన్ ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా జనవరి 24 నుంచి ఫిబ్రవరి 14 వరకు 22 రోజులపాటు కాజీపేట రైల్వే జంక్షన్ బలార్షా సెక్షన్ లో ప్రతిరోజు, రెండు మూడు రోజులకు ఒకసారి నడిచే (వారాంతరపు) పలు ప్రయాణికుల రైళ్ల రాకపోకలను రద్దు చేయనున్నారు.సుదూర ప్రాంతాలైన తిరువనంతపురం, కన్యాకుమారి, బెంగళూరు, యశ్వంత పూర్, హుబ్లీ, చెన్నై, కలకత్తా, ముంబై, న్యూఢిల్లీ, జమ్మూతావి, బిలాస్‌పూర్, వారణాసి, దానాపూర్ తదితర ముఖ్య రైల్వే కేంద్రాల నుంచి నడిచే పలు రైళ్లను కాజీపేట, సికింద్రాబాద్, నిజాంబాద్, అకోలా, ఇటార్సీ, నాగపూర్ తదితర రైల్వే స్టేషన్ల మీదుగా దారి మళ్ళించి నడపనున్నారు. ఈ సెక్షన్ మీదుగా ఈ తేదీలలో రైల్వే శాఖ రద్దు పరిచిన, దారి మళ్లించిన పలు రైళ్ల వివరాలు, విషయంను ప్రయాణికులు గమనించాలని రైల్వే అధికారులు కోరారు.



# కట్టుతప్పుతున్న ఎమ్మెల్యేలు

విజయవాడ, నవంబర్ 25, 2024 అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ (టీడీపీ), జనసేన, బీజేపీ కూటమి 164 సీట్లతో అధికారంలోకి వచ్చింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) కేవలం 11 సీట్లతో ప్రతిపక్షంగా మిగిలింది. ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని జగన్ అసెంబ్లీకి రావడం మానేశారు. ఈ "బలహీన ప్రతిపక్షం" కూటమి ప్రభుత్వానికి "సమస్యగా" మారిన సూచనలు కనిపిస్తున్నాయి. తమకు "ఎదురు లేదని" ఎమ్మెల్యేలు కట్టుతప్పుతున్నారు. 2024 ఎన్నికల్లో వైసీపీ 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోవడం రాష్ట్ర రాజకీయాలను పూర్తిగా మార్చేసింది. అవినీతి ఆరోపణలు, పాలనలో ఘోరాలు, రైతులు, మహిళలు, యువతలో అసంతృప్తి కారణంగా వైసీపీ ఘోరంగా ఓడిపోయింది. వైసీపీకి ప్రతిపక్ష హోదాకు అవకాశం లేకపోవడం వల్ల.. అసెంబ్లీ రూల్స్ ప్రకారం 10% సీట్లు అవసరం అయినా రాకపోవడం వల్ల "సైలెంట్ ఓపోజిషన్" స్థితిని సృష్టించింది. ప్రతిపక్ష బలహీనత ప్రభుత్వానికి "ఫ్రీ పాస్" ఇస్తోంది. వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ రాకపోవడం, హౌస్ కమిటీల్లో ఉండకపోవడం ఫలితంగా, ప్రభుత్వ నిర్ణయాలపై రాజ్యాంగ వేదికపై ప్రశ్నించడం తగ్గిపోయింది."సరైన ప్రతిపక్షం లేకపోవడం" కూటమి ప్రభుత్వానికి రెండు వైపులా సమస్యలు సృష్టిస్తోంది. ఎదురు లేకపోవడం వల్ల ప్రభుత్వం సులభంగా రిఫార్మ్స్ అమలు చేస్తోంది. జనసేన, బీజేపీలు కూటమి భాగస్వాములు కావడం వల్ల అంతర్గత విమర్శలు తక్కువ. కానీ ప్రతిపక్షం లేకపోవడం "అకౌంటబిలిటీ"ను తగ్గిస్తుంది. వైసీపీ అసెంబ్లీకి రాకపోవడం పార్లమెంటరీ డెమాక్రసీకి దెబ్బ అనుకోవచ్చు. బలమైన ప్రతిపక్షం లేకపోవడం ప్రభుత్వాన్ని "అబ్యూజ్ ఆఫ్ పవర్"కు ప్రేరేపిస్తుంది. ఇప్పుడు అదే జరుగుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. ప్రతిపక్ష బలహీనత వల్ల కొంతమంది ఎమ్మెల్యేలు "కట్టుతప్పుతున్నారన్న"ఆరోపణలుపెరిగాయి. ఎదురు లేకపోవడం వల్ల "చెక్స్ అండ్ బాలెన్సెస్" లేకపోవడం అనైతికతకు దారి తీస్తుంది. ప్రతిపక్షం లేకపోవడం వల్ల ఎమ్మెల్యేలు "సెల్ఫ్-సర్వింగ్" మోడ్‌లోకి వెళ్లారు.అందుకే ఎమ్మెల్యేలపై ఆరోపణలు వస్తున్నాయి. టీడీపీతో పాటు జనసేన పార్టీ ఎమ్మెల్యేలు కూడా కొంత మంది ప్రత్యేకంగా దందాలు చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. స్వయంగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఎమ్మెల్యేల తీరుపై హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అయితే వారిలో ఎంత మంది పట్టించుకుంటున్నారో లేదో స్పష్టత లేదు. ఎమ్మెల్యేల వల్ల ప్రభుత్వానికి ఎంతో ఇబ్బంది ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.ప్రతిపక్షం లేకపోవడం వల్ల "ఇన్‌ఫైటింగ్" పెరిగే అవకాశం కనిపిస్తోంది. టీడీపీ-జనసేన మధ్య ఇలాంటివి తరచూ కనిపిస్తున్నాయి. ప్రభుత్వంలో ఉన్నప్పుడు వివిధ అంశాలపై వేర్వేరు అభిప్రాయాలు సహజమే కానీ.. అవి ప్రతిపక్షం లేకపోవడం వల్ల రావడం సమస్యలు సృష్టిస్తుంది. ప్రతిపక్షం లేకపోవడం వల్ల అకౌంటబిలిటీని తగ్గించి, అనైతిక ప్రవర్తనలకు దారి తీస్తోంది. ఎమ్మెల్యేలు "ఎదురు లేదని" లాభపడుతున్నారనే ఆరోపణలు నిజమవుతున్నాయి. ఇది లాంగ్-టర్మ్‌లో ప్రభుత్వానికి బూమరాంగ్ అవుతుంది. అందుకే కూటమి ప్రభుత్వం జాగ్రత్త పడాల్సిన అవసరం కనిపిస్తోంది.

# దూరం.. దూరం అంటూనే .. దగ్గరవుతున్న విజయసాయి



విజయవాడ, నవంబర్ 25, రాజకీయాలకు గుడ్‌బై..ఇక నుంచి వ్యవసాయం చేసుకుంటానని చెప్పిన మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి..రూట్ మార్చినట్లు కనిపిస్తోంది. పాలిటిక్స్‌కు గుడ్‌బై చెప్పి ఏడాది కాకముందే ఎప్పుడూ ఏదో ఒక స్టేట్‌మెంట్ ఇస్తూ..ఆసక్తికర ట్వీట్స్ చేస్తూ పొలిటికల్ హాట్ టాపిక్‌గా కొనసాగుతున్నారు. ఇప్పుడేమో ఏ పార్టీలో చేరే ఆలోచన లేదంటారు. మరోసారి అవసరమైతే కొత్త పార్టీ పెడతా అంటారు. తన అవసరం ఉందనుకుంటే రాజకీయాల్లోకి వస్తానంటారు.అసలు ఈ పొంతన లేని స్టేట్‌మెంట్స్ ఎందుకన్న చర్చ జరుగుతోంది. శ్రీకాకుళం జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో విజయసాయిరెడ్డి పాల్గొన్నారు. ఎప్పటిలాగే..జగన్ కోటరీ అంటూ డైలాగులు పేల్చారు. పవన్‌ను పొగిడేందుకు ప్రయత్నించారు. తనకు ఆయనతో 20 ఏళ్ల స్నేహం ఉందని గుర్తు చేసుకున్నారు. ఆయనను తాను ఎప్పుడూ ఒక్క మాట కూడా అనలేదని.. భవిష్యత్‌లో కూడా అనననని చెప్పారు. కానీ గతంలో పవన్‌ను పావలా అని.. విమర్శించిన విషయాన్ని ఆయన మార్చిపోయారంటూ సోషల్ మీడియాలో మీమ్స్ వస్తున్నాయ్.ఎప్పటికప్పుడు సమ్‌థింగ్ డిఫరెంట్ అన్నట్లుగా కామెంట్స్ చేస్తూ వస్తున్నారు విజయసాయిరెడ్డి. మొన్నటివరకు రాజకీయాలకు దూరంగా ఉన్నట్లుగా..పబ్లిక్ వాయిస్‌గా ట్వీట్స్ చేస్తూ చర్చకు దారితీశారు. ఇప్పుడేమో తన అవసరమైతే మళ్లీ పాలిటిక్స్‌లోకి వస్తానంటున్నారు. ఆయన అవసరం పబ్లిక్‌కు ఉందా? లేక ఆయనకే రాజకీయాలు తప్పనిసరిగా మారాయా అన్నది ఇక్కడ పాయింట్. విజయసాయిరెడ్డి అవసరం వైసీపీకి ఉండొచ్చు. ఎందుకంటే గతంలో ఆ పార్టీలో నెంబర్.2గా పనిచేశారు. తెరవెనుక రాజకీయాలు చక్కబెట్టడంలో జగన్‌కు సాయిరెడ్డి బ్యాక్ బోన్ లాంటి వాడని చెప్తుంటారు. అలాంటి విజయసాయిరెడ్డి వైసీపీని వీడినప్పటి నుంచి జగన్ కోటరీని టార్గెట్ చేస్తున్నారు.కోటరీ వల్లే తాను జగన్‌కు దూరమయ్యాను..జగన్‌ను మిస్ అవుతున్నాను అన్నట్లుగా మాట్లాడుతున్నారు విజయసాయిరెడ్డి. తన విషయంలో జగన్ కోటరీ ఆయనను పూర్తిగా డైవర్ట్ చేస్తోందని..అలాంటి వారి మాటలు వినరాదని, అన్నీ ఆలోచించాలని జగన్‌కు సూచించారు. అంటే జగన్ మంచిని కోరుకుంటున్నాను అన్నట్లుగా చెప్పుకొచ్చారు విజయసాయిరెడ్డి.విజయసాయిరెడ్డి మాజీ ఎంపీ మాత్రమే కాదు..మాజీ వైసీపీ నేత, జగన్‌కు అత్యంత సన్నిహితుడు కూడా. ఆయన ఏం మాట్లాడినా పొలిటికల్ యాంగిల్ వెతకడం, దాన్ని హైలెట్ చేయడం కామన్. ఈ నేపథ్యంలోనే లేటెస్ట్‌గా విజయసాయిరెడ్డి చేసిన కామెంట్స్ పొలిటికల్ ఇంట్రెస్టింగ్‌గా మారాయి. సాయిరెడ్డి మనసు వైసీపీ వైపు లాగుతుందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏదో ఒక ఫైన్ మార్నింగ్ విజయసాయిరెడ్డి వైసీపీలో చేరిక ప్రకటన రావొచ్చన్న ఊహాగానాలు ఉండే ఉన్నాయి. కూటమి అధికారంలోకి వచ్చి 18 నెలలు కావొస్తోంది. వైసీపీ అధినేత జగన్ పార్టీ బలోపేతం కోసం నియోజకవర్గాల్లో పార్టీ వ్యవహారాలను చక్కబెడుతూ వస్తున్నారు. పార్టీకి దూరమైన నేతలను దగ్గర చేసే ప్రయత్నాల్లో పడ్డారు.మొన్నా మధ్య పార్టీని విడిచి వెళ్లిపోయిన నేతలు తిరిగి పార్టీలోకి రావొచ్చు..నో అబ్జక్షన్స్ అంటూ వైసీపీ ఇంటర్నల్ మీటింగ్‌లో ఓపెన్ ఆఫర్ ఇచ్చారు జగన్. ఈ క్రమంలోనే విజయసాయిరెడ్డి తిరిగి వైసీపీ గూటికి చేరతారని పెద్దఎత్తున ప్రచారం కూడా నడిచింది. అయితే జగన్ నుంచే పిలుపు రావాలని విజయసాయిరెడ్డి ఎదురుచూస్తున్నట్లు ఇన్ సైడ్ టాక్. ఇది ఎంతవరకు నిజమో తెలియదు కానీ..వ్యవసాయం చేసుకుంటానని చెప్పి..విజయసాయిరెడ్డి తరచూ రాజకీయాలు..పొలిటికల్ రీఎంట్రీపై మాట్లాడుతుండటం మాత్రం ఆయనలో ఉన్న పొలిటికల్ ఇంట్రెస్ట్‌ను స్పష్టం చేస్తోంది. రాబోయే రోజుల్లో విజయసాయిరెడ్డి రాజకీయ అడుగులు ఎటువైపు పడతాయో చూడాలి.ఇక.. పొట్టి శ్రీరాములు, ఎన్టీఆర్, అన్నమయ్య, అల్లూరి సీతారామరాజు, రాజశేఖర్ రెడ్డి పేరుతో జిల్లాలు ఉన్నాయని.. సైరా నరసింహారెడ్డి పేరును కర్నూలు జిల్లాకు పెట్టాలని ఆయన సూచించారు. అలా చేస్తే ఒక స్వాతంత్ర్య సమరయోధుడిని గౌరవించినట్టు అవుతుందన్నారు. శ్రీకాకుళంలో రెడ్డి సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి మొత్తం నేనే భరిస్తాను అని చెప్పారు. చాలామంది నాపై చాలా సెటైర్లు వేస్తున్నారన్న విజయసాయిరెడ్డి.. ఎవరెన్ని అనుకున్నా నేను ప్రస్తుతం రైతును మాత్రమే అని తేల్చి చెప్పారు.చాలా ఒత్తిళ్లు వచ్చాయి. ప్రస్తుతానికి రాజకీయ పార్టీ పెట్టే ఆలోచన లేదు. ఇతర పార్టీల్లోనూ చేరే ఉద్దేశమూ లేదు. విపరీతమైన ఒత్తిడి వచ్చినా నేను ఎవరికీ లొంగలేదు. జగన్ చుట్టూ ఉన్న కోటరీ ఆయన్ని డైవర్ట్ చేస్తోంది. అందుకే నేను రాజకీయాలకు దూరంగా ఉంటున్నా. నిబద్ధత లేని వారి మాటలు వినొద్దని జగన్ కు నా సూచన. నాకు ఏ పార్టీ నుంచి కూడా పిలుపు రాలేదు. ప్రస్తుతానికి నేను రైతును మాత్రమే. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తో 20 ఏళ్ల స్నేహం ఉంది. ఆయనను ఒక్క మాట కూడా అనలేదు" అని హాట్ కామెంట్స్ చేశారు విజయసాయిరెడ్డి.

# నియోజకవర్గం మార్పు తప్పదా

రాజమండ్రి, నవంబర్ 25,జనసేనకు చెందిన మంత్రి కందుల దుర్గేష్ ఈసారి నియోజకవర్గాన్ని మార్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆయన నిడదవోలు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కానీ కందుల దుర్గేష్ సొంత ప్రదేశం రాజమండ్రి కావడంతో వచ్చే ఎన్నికల్లో కందుల దుర్గేష్ రాజమండ్రి రూరల్ నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారని పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. రాజమండ్రి రూరల్ నియోజకవర్గంలో ప్రస్తుతం టీడీపీ నుంచి సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఉన్నారు. ఆయన వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేదు. గత ఎన్నికల సమయంలోనే ఇదే తనకు చివరి ఎన్నిక అని కూడా గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రకటించార. దీంతో వచ్చే ఎన్నికల్లో రాజమండ్రి రూరల్ నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించి, నిడదవోలు నియోజకవర్గాన్ని టీడీపీకి కేటాయించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కందుల దుర్గేష్ పర్యాటక, సినిమా టోగ్రఫీ మంత్రిగా ఉన్నప్పటికీ ఆయన ఎక్కువ సమయం రాజమండ్రి లోనే గడుపుతున్నారు. రాజమండ్రి రూరల్ నియోజకవర్గం జనసేన నేతలు, క్యాడర్ తోనూ ఆయన టచ్ లో ఉండటం కూడా ఈ సందేహాలకు మరింత ఊతమిచ్చినట్లు కనిపిస్తుంది. సీనియర్లను క్రమంగా పక్కన పెడుతున్న టీడీపీ అధినాయకత్వం ఈసారి గోరంట్ల బుచ్చయ్య చౌదరికి కూడా టిక్కెట్ ఇవ్వకపోవచ్చు. ఆయన ఇప్పటికే ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలవడంతో ఆయనకు నామినేటెడ్ పదవి ఇచ్చిపెద్దల సభకు పంపుతామని చెప్పి రాజమండ్రి రూరల్ నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయిస్తారని, అక్కడి నుంచి కందుల దుర్గేష్ పోటీ చేయడం ఖాయమని చెబుతున్నారు. టీడీపీకి స్ట్రాంగ్ హోల్డ్ గా ఉన్న... నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా నిడదవోలు నియోజకవర్గం ఏర్పడింది. 2009, 2014 ఎన్నికల్లో అక్కడి నుంచి టీడీపీ అభ్యర్థి బూరుగుపల్లి శేషారావు గెలిచారు. అంటే ఇక్కడ టీడీపీ స్ట్రాంగ్ గా ఉంది. నిడదవోలు టీడీపీ క్యాడర్ నుంచి కూడా వత్తిడి తీవ్రంగా వస్తుంది. అందుకే నిడదవోలను వచ్చే ఎన్నికల్లో టీడీపీ తీసుకుని, రాజమండ్రి రూరల్ నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అందుకే మంత్రి గా ఉన్న కందుల దుర్గేష్ ఎక్కువగా ఇక్కడే పర్యటిస్తూ క్యాడర్ కు తాను వచ్చేస్తున్నానంటూ సంకేతాలను ఇస్తున్నారట. మొత్తం మీద ఎక్స్ఛేంజ్ మేళాలో రెండు సీట్లను పరస్పరం రెండు పార్టీలు మార్పిడి చేసుకుంటాయన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతుంది.

# జగన్ కు దగ్గరవుతున్న జేసీ ఫ్యామిలీ..

అనంతపురం, నవంబర్ 25, అనంతపురం మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి కుమారుడు జేసీ పవన్ రెడ్డి వైసీపీలో చేరేందుకు సిద్ధమవుతున్నారని పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. జేసీ దివాకర్ రెడ్డి ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ఆయన వారసుడిగా మొన్నటి ఎన్నికల్లో రాజకీయాల్లో రావాలని భావిస్తే టీడీపీ టిక్కెట్ కేటాయించలేదు. ఒక కుటుంబంలో ఒకరికే టిక్కెట్ అన్న సూత్రంతో జేసీ పవన్ రెడ్డికి టిక్కెట్ ఇవ్వని టీడీపీ నాయకత్వం జేసీ ప్రభాకర్ రెడ్డి కుమారుడు అస్మిత్ రెడ్డికి తాడిపత్రి నియోజకవర్గం టిక్కెట్ ఇచ్చింది. అయితే వచ్చే ఎన్నికల్లోనూ ఒకే కుటుంబానికి ఒకే టిక్కెట్ అనేది టీడీపీ అనుసరిస్తే తాడిపత్రి మాత్రమే జేసీ కుటుంబానికి దక్కుతుంది. అనంతపురం పార్లమెంటు మళ్లీ కూడా దక్కదు. . అందుకే జేసీ పవన్ రెడ్డి వైసీపీకి దగ్గరవుతున్నారని తెలిసింది. అనంతపురం పార్లమెంటు నియోజకవర్గంపై ఇప్పటికీ జేసీ కుటుంబానికి పట్టు ఉంది. అయితే తన తండ్రి సోదరుడు కుమారుడు టీడీపీలో ఉండటం, తాను వైసీపీ లోకి వెళితే ఏ మేరకు కలసి వస్తుందన్న దానిపై ఇంకా తర్జన భర్జన పడుతున్నారని తెలిసింది. జేసీ పవన్ రెడ్డికి ఒక "మెగా" కాంట్రాక్టరు సన్నిహితుడు కావడంతో ఆయన ద్వారా వైసీపీ టిక్కెట్ ను పొందేందుకు ప్రయత్నిస్తున్నారన్న ప్రచారం జరుగుతుంది. నిజానికి మరొకరి సిఫార్సు పవన్ రెడ్డికి పనిలేదు. వైసీపీ అధినేత జగన్ తో సత్సంబంధాలున్నాయి. ఇద్దరూ మంచిమిత్రులేనని అందరూ చెబుతారు. ఎన్నో ఏళ్ల నుంచి వీరి మధ్య మంచి రిలేషన్ నడుస్తుంది. ఇంకా చర్చల దశలోనే... అందుకే వచ్చే ఎన్నికలకు ముందే పవన్ రెడ్డి వైసీపీలో చేరే అవకాశముందని పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. టీడీపీలో ఉంటే తమలో ఒక్కరికి మాత్రమే టిక్కెట్ దక్కుతుందని, అందుకని వేర్వేరు పార్టీల్లో ఉండటం మంచిదని భావిస్తున్నారు. అందుకే జేసీ ప్రభాకర్ రెడ్డి కూడా గతంలో మాదిరిగా జగన్ పై వ్యక్తిగత విమర్శలు చేయకుండా ఉండటానికి ఇదే కారణమని చెబుతున్నారు. అయితే దీనిపై జగన్ ఇంకా క్లారిటీ ఇవ్వలేదని తెలిసింది. జేసీ పవన్ రెడ్డి పట్ల జగన్ కు సానుకూలత ఉన్నప్పటికీ జేసీ కుటుంబాన్ని పార్టీలో చేర్చుకుంటే జిల్లాలోనే కాకుండా సీమ జిల్లాల్లో తప్పుడు సంకేతాలు వెళతాయని ఆలోచిస్తున్నారని తెలిసింది.

# హస్తినపై మనస్సులో..అమరావతిలో తనువు

ఏలూరు, నవంబర్ 25, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు ఎమ్మెల్యే పదవి పట్ల సంతృప్తిగా లేరు. ఆయన చూపంతా హస్తినపైనే ఉంది. గత ఎన్నికల సమయంలో రఘురామ కృష్ణరాజు నరసాపురం పార్లమెంటు టిక్కెట్ కోసం చివర వరకూ ప్రయత్నించారు. అయితే అది బీజేపీ కోటాలోకి వెళ్లిపోవడంతో ఆయనకు ఎక్కడో ఒకచోట స్థానం కల్పించాలన్న ఉద్దేశ్యంతో ఉండి శాసనసభ నుంచి టీడీపీ పోటీ చేయించింది. గెలిచిన తర్వాత డిప్యూటీ స్పీకర్ పదవిని అప్పగించింది. కేబినెట్ ర్యాంకు పదవి అయినప్పటికీ ఆయన మనసంతా ఢిల్లీపైనే ఉంది. వచ్చే ఎన్నికల నాటికి తాను పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని ఆయన భావిస్తున్నట్లే కనపడుతుంది. ఆయన తన సన్నిహితుల వద్ద చేస్తున్న వ్యాఖ్యలు కూడా ఇలాగే ఉంటున్నాయి.ఆయన తన సన్నిహితుల వద్ద చేస్తున్న వ్యాఖ్యలు కూడా ఇలాగే ఉంటున్నాయి.అయితే అప్పటికే ఉండి నియోజకవర్గానికి సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న మంతెన రామరాజు ను ఒప్పించి రఘురామ కృష్ణరాజుకు టీడీపీ నాయకత్వం ఆ సీటును కేటాయించింది. మంతెన రామరాజుకు నామినేటెడ్ పోస్టు ఇచ్చింది. ఆయనను ఏపీఐఐసీ ఛైర్మన్ గా నియమించింది. అయితే అక్కడ జనసేన లో కూడా కొంత అసంతృప్తి కనపడుతుంది. ఉండి నియోజకవర్గం తమకు కావాలని గత ఎన్నికల్లోనే జనసేన గట్టిగా పోరాడింది. అయితే రఘురామ కృష్ణరాజు కోసమే కాకుండా,టీడీపీ సిట్టింగ్ సీటు కావడంతో జనసేకు ఇవ్వలేదు. ఉండి జనసేన ఇన్ ఛార్జి నాగరాజుకు ఇప్పటి వరకూ ఎలాంటి పదవి దక్కకపోవడంతో ఆయన అసంతృప్తిగా ఉన్నారని సమాచారం. నాగరాజు శెట్టి బలిజ సామాజికవర్గం నేత కావడంతో ఆయన తన అసంతృప్తిని సన్నిహితుల ముందు వెళ్లగక్కుతున్నారట.మరొకవైపు డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు మాత్రం వచ్చే ఎన్నికల్లో ఉండి నుంచి పోటీ చేయడానికి పెద్దగా ఇష్టపడటం లేదు. రఘురామ కృష్ణరాజుకు రాష్ట్ర రాజకీయాల కంటే ఢిల్లీలో ఉండటమే ఎక్కువగా ఇష్టపడతారు. ఆయన ఈసారి గట్టిగా తనకు టిక్కెట్ కావాలని పట్టుబడుతున్నారు. వచ్చే ఎన్నికల్లో నరసాపురం నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి ఇప్పటి నుంచే గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటున్నారని తెలిసింది. ప్రస్తుతం నరసాపురం ఎంపీగా ఉన్న శ్రీనివాసవర్మ కేంద్ర మంత్రిగా కూడా ఉన్నారు. అయితే ఆయనను తప్పించి రఘురామ కృష్ణరాజుకు వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ ఇస్తారా? అన్నది సందేహమే అయినప్పటికీ ఈసారి టీడీపీ కోటాలో నరసాపురం తనకు కేటాయించాలని రఘురామ కృష్ణరాజు పట్టుబట్టే అవకాశముందంటున్నారు

# చెత్తను వేయకుండా సూపర్ ప్లాన్

విశాఖపట్టణం, నవంబర్ 25, ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయకుండా నివారించేందుకు గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కొత్త ఆలోచన చేసింది. స్థానికుల సహకారంతో దీనిని అమలు చేస్తోంది. చెత్త వేసే ప్రదేశాలను శుభ్రపరిచి.. దేవుడి ఫోటోలు, మొక్కల కుండీలు, ముగ్గులు ఏర్పాటు చేస్తున్నారు. దీని ద్వారా ఆ ప్రదేశంలో మరోసారి చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటున్నారు. కొన్ని ప్రదేశాల్లో ఇది మంచి ఫలితాలు ఇవ్వటంతో త్వరలోనే విశాఖ నగరం మొత్తం అనుసరించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.వీధుల్లో నడిచివెళ్లేటప్పుడూ.. కొన్నిసార్లు గోడలపై గమనించే ఉంటారు.. ఇక్కడ మూత్రం పోసిన వాడు గాడిద. ఇక్కడ చెత్త వేస్తే శిక్షార్హం.. అంటూ కొటేషన్లు, హెచ్చరిక బోర్డులు గమనించే ఉంటారు. ఎవరెన్ని కొటేషన్లు రాసినా.. అధికారులు ఎన్ని హెచ్చరికలు చేసినా కొంతమంది మాత్రం పద్ధతి మార్చుకోరు. పరిశుభ్రతతో పనిలేదు.. అధికారుల హెచ్చరికలతో అస్సలు అవసరం లేదు.. తమ పంథా తమదే.. తమ పని తమదే. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు.. చెత్త వేసేస్తూ ఉంటారు. ప్రభుత్వం ఇంటింటికీ చెత్త సేకరణ జరుపుతున్నా.. చెత్త కుండీలు ఏర్పాటు చేసినా కూడా ఇలాంటి వారిలో మార్పులు ఆశించడం అత్యాశే అవుతోంది. కాలనీలలోని ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు, చెత్తను పారబోస్తూ అపరిశుభ్ర వాతావరణానికి కారణమవుతున్నారు. అలాంటి చోట్ల అధికారులు బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ ఇలాంటి వారిలో ఎలాంటి మార్పూ లేదు.దీంతో ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) ఓ సరికొత్త ఆలోచన చేసింది. స్థానికుల సహకారంతో ఈ వినూత్న కార్యక్రమాన్ని అమలు చేస్తూ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తోంది. ఎక్కడైతే వ్యర్థాలను పారేస్తున్నారో అలాంటి ప్రదేశాలను గుర్తించి.. ఆ ప్రాంతాన్ని పరిశుభ్రం చేస్తున్నారు. ఆ తర్వాత దేవుడి ఫోటోలు పెట్టి.. ముగ్గులు వేస్తున్నారు. మరికొన్ని చోట్ల కుండీలలో మొక్కలు ఉంచుతున్నారు. ప్రయోగాత్మకంగా కొన్ని చోట్ల ఈ పద్ధతి అనుసరించగా సత్ఫలితాలు వచ్చాయి. అందుకే విశాఖపట్నం నగరం మొత్తం ఈ విధానం అనుసరించాలని జీవీఎంసీ ఆలోచనలు చేస్తోంది. దేవుడి ఫోటోలు పెట్టడం, ముగ్గులు పెట్టటంతో చెత్త వేసేవారిలో మార్పు వస్తోంది. తమ చర్యలను విరమించుకుంటున్నారు. దీంతో విశాఖపట్నం మొత్తం ఈ కార్యక్రమం అమలు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18వ వార్డులో ఉన్న ఎంవీపీ కాలనీ సెక్టార్?9లో ఇటీవల జీవీఎంసీ ఈ కార్యక్రమం నిర్వహించింది. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన పరిసరాలను నిర్వహించడంపై స్థానికులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. కార్పొరేటర్ గోలగాని మంగవేణి ప్రజలు తమ పరిసరాలను చెత్త లేకుండా ఉంచుకోవాలని కోరారుచెత్త వేసే ప్రాంతంలో శుభ్రం చేసి ముగ్గులు వేశారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను పారేసే వారిపై కఠినమైన జరిమానాలు విధిస్తామని జీవీఎంసీ అధికారులు హెచ్చరిస్తున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తున్నారు. అలా కాదని నిబంధనలు అతిక్రమించి చెత్త వేస్తే వేయి రూపాయలు జరిమానా విధిస్తామని హెచ్చరిస్తున్నారు.

# శ్రీవారి ఆలయం నుండి శ్రీ పద్మావతి అమ్మవారికి సారె

తిరుచానూరు, శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన మంగళవారం నాడు పంచమితీర్థం ఉత్సవాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి ఆలయం నుంచి సారె ను ఊరేగింపుగా శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి తీసుకెళ్లారు. ప్రతి ఏటా పంచమితీర్థం రోజున తిరుమల నుంచి సారె తీసుకెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. ముందుగా శ్రీవారి ఆలయంలో ఉదయం 2.30 నుండి పరిమళాన్ని(నామకోపు, శ్రీ చూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన మిశ్రమం) విమాన ప్రాకారంలో ఊరేగింపు చేపట్టారు. ఆ తరువాత ఉదయం 4.30 గంటలకు తిరుమల శ్రీవారి ఆలయం నుంచి పసుపు, కుంకుమ, ప్రసాదాలు, తులసి, వస్త్రాలు, ఆభరణంతో కూడిన సారె ఊరేగింపు మొదలైంది. సారెను టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం సారెను అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

# ఏపీలో మ్యాజిక్ డ్రెయిన్స్

ఏలూరు, నవంబర్ 25, పల్లెల్లో మురుగునీటి వ్యవస్థను సక్రమంగా నిర్వహించేందుకు మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మించాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 106 గ్రామ పంచాయతీలలో మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మించనున్నారు. తొలివిడతగా 59 కిలోమీటర్ల మేరకు ఈ మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం జరగనుంది. తక్కువ ఖర్చు, దుర్వాసన లేకపోవటం, మెరుగైన నిర్వహణ వంటి కారణాలతో ప్రభుత్వం సిమెంట్ డ్రెయిన్ల బదులుగా మ్యాజిక్ డ్రెయిన్ల వైపు మొగ్గు చూపుతోంది. ఏపీలో ఇప్పటికే కొన్నిచోట్ల వీటి నిర్మాణం జరిగింది. అక్కడ మంచి ఫలితాలు వస్తూ ఉండటంతో మరికొన్ని చోట్ల నిర్మించనున్నారు.పల్లెలలో పారిశుద్ధ్య నిర్వహణ, పరిశుభ్ర వాతావరణం ఏర్పాటు చేసే దిశగా ఏపీ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా రాష్ట్రంలోని 106 గ్రామ పంచాయతీలల్లో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టనుంది. గ్రామీణాభివృద్ధి శాక చీఫ్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ గోపీచంద్ ఈ విషయాన్ని వెల్లడించారు. 106 గ్రామపంచాయతీల పరిధిలో 59 కిలోమీటర్ల మేరకు మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మించనున్నట్లు ఆయన వెల్లడించారు. గ్రామాలలో మురుగునీటి వ్యవస్థను సక్రమంగా నిర్వహించాలని భావిస్తున్న ఏపీ ప్రభుత్వం.. అందులో భాగంగానే మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టనుంది. పైలెట్ ప్రాజెక్టు కింద ఇప్పటికే మ్యాజిక్ డ్రెయిన్లు ఏర్పాటు చేశారు. ఇవి సత్ఫలితాలు ఇస్తూ ఉండటంతో 106 గ్రామపంచాయతీలలో వీటిని నిర్మించాలని భావిస్తున్నారు. తొలి విడతగా 59 కిలోమీటర్ల మేర నిర్మించనున్నారు. మూడు నెలల తర్వాత మ్యాజిక్ డ్రెయిన్లను పూర్తిస్థాయిలో అమలు చేయాలని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు భావిస్తు?న్నారు.మరోవైపు మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మురుగునీటి సమస్యలకు.. తక్కువ ఖర్చుతో సమర్థవంతమైన పరిష్కారం లభిస్తుందని అధికారులు చెప్తున్నారు. అలాగే దుర్వాసన, దోమలు, కాలుష్యం వంటి సమస్యలకు చెక్ పెట్టవచ్చని భావిస్తున్నారు. ఇక ఆర్థికంగానూ ఇది మంచి పరిష్కారం కానుంది. ఒక కిలోమీటర్ మేరకు సిమెంట్ డ్రెయిన్ నిర్మించాలనే సుమారుగా రూ. 50 లక్షలు ఖర్చు అయితే.. ఈ మ్యాజిక్ డ్రెయిన్లు అయితే రూ.7.5 లక్షలకే పూర్తవుతుందని అధికారులు చెప్తున్నారు. అలాగే మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణానికి తక్కువ స్థలం సరిపోతుంది. మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన వచ్చే అవకాశం ఉండదు.మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణం కోసం తొలుత 2 అడుగుల లోతు, అరమీటర్ వెడల్పు ఉండేలా ఓ కాలువను తవ్వుతారు. అందులో తొలుత అడుగు మేర కొండరాయితో నింపుతారు. దాని పైపొరలో గులకరాళ్లు 8 అంగుళాల మేర నింపుతారు. దాని మీద కంకర రాళు 4 అంగుళాల మేరపరుస్తారు. చివరిగా గండ్ర ఇసుక పోస్తారు. ఇలా మూడు పొరలతో ఈ మ్యాజిక్ డ్రెయిన్ నిర్మిస్తారు. డ్రెయిన్ మధ్యలో 50 మీటర్లకు ఓసారి ఇంకుడు గుంత ఏర్పాటు చేస్తారు. దీంతో మురుగునీరు నేలలోకి ఇంకుతుంది, అలాగే భూగర్భ జల స్థాయిలను మెరుగుపరుస్తుంది. వీటితో పాటుగా భారీ వర్షాల సమయంలో నీరు నిలిచిపోకుండా ఉంటుందని అధికారులు చెప్తున్నారు.

# పబ్బతి వేణు అక్రమ భూకబ్జాలపై సీబీసీఐడీ విచారణ జరపాలి:సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు డిమాండ్




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 25-నంద్యాల పట్టణంలోని ఉప్పరపేట బాల్కొండ హాల్ సమీపంలో సర్వే నెం. 888/పి1లో ఉన్న స్వాతంత్ర సమరయోధుడు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తాళ్లపల్లి వీరయ్య కుటుంబానికి చెందిన 50 సెంట్ల గ్రామకంటకం భూమిని బిల్డర్ పబ్బతి వేణు తప్పుడు ధ్రువపత్రాలతో బినామీ పేర్లపై స్వాధీనం చేసుకుని అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నాడని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు ఆరోపించారు. ప్రభుత్వాన్ని మోసం చేసి రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు లంచాలు ఇచ్చి ఐదు అంతస్తుల భవనం నిర్మించి ప్రజలను మోసగిస్తూ అమ్మకాలు చేస్తుండటం దారుణమన్నారు. అలాగే పద్మావతి నగర్‌లో మాజీ సైనికుడి భూమిని కూడా అక్రమంగా కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. పబ్బతి వేణు సంపాదించిన అక్రమాస్తులపై సీబీసీఐడీ ద్వారా సమగ్ర విచారణ జరిపి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భూకబ్జాల స్థలాల్లో ఎర్రజెండాలు పాతి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, రైతు సంఘం, ఏఐటీయూసీ, మహిళా సంఘం, ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

# గుంతనాలలో రైతన్నా మీకోసం : మంత్రి ఎన్ఎండి ఫరూక్ హాజరు



--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 25-నంద్యాల మండలం గుంతనాల గ్రామంలో వ్యవసాయ శాఖ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రైతుల ఇళ్లకు స్వయంగా వెళ్లి రైతన్నా మీకోసం పాంప్లెట్ లను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చేందుకు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. అమలులో ఉన్న పథకాలు, సబ్సిడీలు, సహాయక కార్యక్రమాలపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. ప్రతి రైతు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తున్నదని, సాగు రంగాన్ని పటిష్టం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల టిడిపి మండల కన్వీనర్ మునగాల విశ్వనాథ్ రెడ్డి, ఎంపీడీవో, వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద రావు , సచివాలయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు షష్టి సందర్భంగా సుబ్రహ్మణ్య స్వామికి విశేష పూజలు..



విభారే న్యూస్ నవంబర్ 25 కర్నూలు జిల్లా ప్రతినిధి..జయ గురు దత్త శ్రీ గురు దత్త శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వారి దివ్య ఆశీస్సులతో శ్రీ సూర్య నారాయణ స్వామి దేవాలయంలో 26-11-25, బుధవారం,మార్గశిర శుక్ల షష్ఠి, సుబ్రహ్మణ్య షష్ఠి. ఈ శుభ సందర్భంగా శ్రీ షణ్ముఖ సుబ్రహ్మణ్య స్వామి వారికి అత్యంత విశేషంగా పూజలు, కావడి సేవలు, అర్చనలు,సర్ప సూక్త విధానంగా పంచామృత అభిషేకాలు జరుగును. ఈరోజ శ్రీ స్వామి వారికి అత్యంత విశేషమైనది. కావున వివాహ సమస్యలు,భూ సమస్యలు, సంతాన సమస్యలు ఉన్నవారు ఈరోజు శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆరాధన ద్వారా తమ సమస్యలను దూరం చేసుకోని శ్రీ స్వామి వారి అనుగ్రహానికి పాత్రులు కాగలరు.సాయంత్రం 5:30 గంటలకు శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారి కళ్యాణం జరుగును.శ్రీ స్వామి వారి కళ్యాణం- 3,500/-కావడి సేవ - 250/-పంచామృత అభిషేకం - 200/-మాసపూజ - 300/-నిత్య పూజ -3000/-సంప్రదించండి :-శ్రీధర్ శర్మ - 799520 2082దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబర్..8896123777 ఆఫీసు ల్యాండ్ ఫోను నెంబర్.. 08518-234388

# డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పగడ్బందీ అమలు: జిల్లా జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 25-డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకాన్ని పగడ్బందీగా అమలు చేసి ప్రతి విద్యార్థి తప్పనిసరిగా భోజనం చేసేలా చూడాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో నిర్వహించిన స్టీరింగ్ కమిటీ సమావేశంలో ఆయన ఈ సూచనలు చేశారు. పిల్లలు ఇష్టపడి భోజనం చేసేలా నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పోషకాహార లోప నివారణతో పాటు విద్యార్థుల హాజరు పెంపే లక్ష్యంగా పని చేయాలన్నారు. భోజనం చేయకుండా వెళ్లిపోతున్న విద్యార్థులపై ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షణ పెంచాలన్నారు. కోడిగుడ్లు సకాలంలో సరఫరా చేయాలని, డ్యామేజ్ అయిన లేదా అన్సైజ్ గుడ్లు వస్తే వెంటనే వెనక్కి పంపించాలని సూచించారు. సోమవారం నుంచి శనివారం వరకు మెనూ ప్రకారం భోజనం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఈవో జనార్దన్ రెడ్డి, ఎంఈఓలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# జీవనశైలిలో సానుకూల మార్పులు: జాయింట్ కలెక్టర్ కార్తీక్

## సిరిధాన్యాలే సంపూర్ణ ఆరోగ్య మార్గం: డా. ఖాదర్ వలి




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 25-చిరుధాన్యాల వినియోగం మానవ ఆరోగ్య జీవనశైలిలో గణనీయమైన మార్పులు తీసుకొస్తుందని జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్ అన్నారు. కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాలులో ఎస్‌బిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ప్రముఖ ఆహార శాస్త్రవేత్త డా. ఖాదర్ వలి పాల్గొని చిరుధాన్యాల పోషక విలువలపై విశదీకరించారు .కార్యక్రమంలో కార్తీక్ మాట్లాడుతూ మిల్లెట్స్‌ను ఆహారంలో చేర్చడం వల్ల రక్తంలో చక్కెర నియంత్రణ, జీర్ణక్రియ మెరుగుదల, ఎముకల బలం వంటి ప్రయోజనాలు లభిస్తాయని తెలిపారు. ఫైబర్, ప్రోటీన్, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం వంటి పోషకాలు అధికంగా ఉండటం వల్ల మధుమేహం, గుండె సంబంధిత వ్యాధుల నియంత్రణకు ఇవి దోహదపడతాయన్నారు. డా. ఖాదర్ వలి మాట్లాడుతూ సిరిధాన్యాలు భారతీయ సంప్రదాయ ఆహార వ్యవస్థలో కీలకమని, ఆధునిక జీవనశైలి వల్ల పక్కనపెట్టబడినా ఇప్పుడు మళ్లీ పునరాగమనమే భవిష్యత్తు ఆరోగ్య రక్షణకు మార్గమని చెప్పారు. తక్కువ నీటితో సాగు చేయగలిగిన ఈ ధాన్యాలు రైతులకు ఆర్థికంగా కూడా లాభదాయకమని తెలిపారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చిరుధాన్యాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా ప్రతీక నంది విగ్రహాన్ని డా. ఖాదర్ వలికి జాయింట్ కలెక్టర్ అందజేసి శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ అధికారులు, వైద్యులు, రైతులు, గృహిణులు తదితరులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణుల పై ఆ వాక్కులు దూషణలకు పాల్పడితే సహించేది లేదు: బ్రాహ్మణ సంఘం..



పట్టణ సీఐ కు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మిగనూరు బ్రాహ్మణ సంఘ నాయకులు.

విభారే న్యూస్ ఎమ్మిగనూరు నవంబర్ 25..బ్రాహ్మణులపై అవాక్కులు దూషణలకు పాల్పడితే సహించేది లేదని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ మాజీ డిఎల్ఓ కరణం గురు రాఘవేంద్రరావు ఎమ్మిగనూరు బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు రఘునందన్ నాయకులు వాసుదేవా చార్ నటరాజశాస్త్రి హనుమంతరావు పేర్కొన్నారు. మంగళవారం పట్టణ పట్టణ సీఐ శ్రీనివాసులకు ఫిర్యాదు చేశారు ఇటీవల డప్పు చంద్రన్న సమస్మరణ సభలో వల్లవోలు రమణ అనే గాయకుడు బ్రాహ్మణ జాతిని బ్రాహ్మణ ఆచార వ్యవహారాలను కించపరుస్తూ వాడు వీడు వీడంటూ ఏక వచనంతో సంబోధిస్తూ అంగీ తొడిగావు ఎందుకయ్యా ఓ బాపనయ్య అంటూ పాట పాడటం యావత్ బ్రాహ్మణ జాతిని అవమానపరచడమైనది వారన్నారు. భారత రాజ్యాంగం మనకు నచ్చిన మతాన్ని నచ్చిన కులాన్ని నచ్చిన వృత్తిని ఎంచుకునే హక్కు ఉందని అన్నారు. ఎవరి కులం ఎవరి మతం వారు ఆచరించవచ్చు అని అన్నారు. ఇతర కులాలను ఇతర మతాలను కించపరిచే విధంగా మాట్లాడడం సబబుగా లేదన్నారు. ఈ మధ్య కొందరికి బ్రాహ్మణులపై వెంగ అస్త్రాలు పేల్చడం పరిపాటిగా మారిందన్నారు. బ్రాహ్మణులు ధరించే జంధ్యాన్ని కూడా అవమానించారని అన్నారు బ్రాహ్మణులను కించపరిచే విధంగా పాటలు పాడుతున్న వల్లబోలు రమణ సభ్యులు జీడి నరసయ్య భారత నాస్తిక సమాజం సభ్యులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే బ్రాహ్మణుల కించపరచ విధంగా పాడిన పాటను యూట్యూబ్ నుండి తొలగించాలని దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వాడు కోరారు ఈ కార్యక్రమంలో పట్టణ బ్రాహ్మణ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# 28 వ తేదీ కాలభైరవ అష్టమి సందర్భంగా సూర్య దేవాలయంలో ప్రత్యేక హోమం..



విభారే న్యూస్ నవంబర్ 25 కర్నూలు జిల్లా ప్రతినిధి..శ్రీ సూర్య నారాయణ స్వామి వారి దేవాలయంలో28-11-2025 శుక్రవారం కాలభైరవ అష్టమి సందర్భంగా ఉదయం9.30గంటలకుఅఘోర పాశుపత రుద్రహోమ సహిత కాలభైరవ హోమం జరుపబడును. ఈ రోజు చేసుకొనే కాలభైరవ హోమం వలన అష్టమశని , ఏలనాటిశని ,అర్ధాష్టమిశని మరియు సమస్త శత్రు రుణ రోగ బాధలు నివారణ జరిగి , సకల అపమృత్యు దోషాలు తొలగి ,కాల భైరవ ,సహిత పరమేశ్వరానుగ్రహం కలుగును .హోమం ప్రధానంగా : 3500 /-సంకల్పం;116 /-సంప్రదించవలసిన నెం :- డి.లక్ష్మీనరసింహ శర్మ:-8008774086దేవాలయం ఫోన్‌పేగూగుల్‌పేనెంబర్.. 88961 23777.ఆఫీసు ల్యాండ్ ఫోను నంబరు..08518-234388

# 7,500 విలువైన శానిటరీ ప్యాడ్‌లు ఉచితంగా పంపిణీ

## బాలికల ఆరోగ్యానికి మున్సిపాలిటీ సామాజిక బాధ్యత



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 25-నంద్యాల పట్టణంలోని పాఠశాల బాలికలకు ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న మంగళవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు రూ. 7,500 విలువ గల శానిటరీ ప్యాడ్‌లను స్కూల్ పిల్లలకు ఉచితంగా పంపిణీ చేశారు. బాలికలు నెలసరి సమయంలో హైజీన్ పాటించడంతో పాటు ఆరోగ్య సమస్యలు ఎదురుకాకుండా ఈ చర్య ఎంతో దోహదపడుతుందని కమిషనర్ తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమాల్లో భాగంగా మున్సిపాలిటీ నిరంతరం ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సూపరైజర్ మురళీధర్, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మీనారాయణ, శివ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. బాలికల ఆరోగ్య భవిష్యత్‌కు ఇది కీలక ముందడుగుగా స్థానికులు అభినందించారు.

# డోన్ నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి మంత్రి లోకేశ్ ను కలసిన ఎమ్మెల్యే కోట్ల

అమరావతి, నవంబర్ 25 : మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలోమంగళవారం విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ని డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి మర్యాదపూర్వ కంగా కలిసి డోన్ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించినపలుకీలక అంశాలపై చర్చించారు. ఈ సంద ర్భంగా ప్యాపి లి పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుగురించి,ఆకళాశాలద్వారాస్థానికవిద్యార్థులకు లభించే ప్రయోజనాలు,విద్యా సౌకర్యాల విస్తరణపై వివరాలు మంత్రి గారికి తెలియజేశారు.



అదే విధంగా డోన్ పట్టణానికి రింగ్ రోడ్డు నిర్మాణం అత్యవసరత,ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, భవిష్యత్ పట్టణాభివృద్ధికి గురించి కూడా ప్రత్యేకంగా చర్చించారు. ఎమ్మెల్యే ప్రస్తావించిన అంశాల న్నింటినీ మంత్రి నారా లోకేష్ శ్రద్ధగా విని, ప్రభుత్వ స్థాయిలో వీటి పై త్వరితగతిన చర్యలు తీసుకునేందుకు పూర్తి సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

# మహానంది క్షేత్ర అభివృద్ధికి దాతల ఉదారత

## నవ వినాయకుల కళావేదిక వద్ద రూ.30 లక్షలతో తాండూరు రాళ్ల ఫ్లోరింగ్

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 25-మహానంది క్షేత్రంలోని రాజగోపురం ముందు ఎడమవైపున ఉన్న నవ వినాయకుల సమీపంలోని కళావేదిక ప్రాంతంలో సుమారు రూ.30 లక్షల వ్యయంతో 150120 అడుగుల విస్తీర్ణంలో తాండూరు స్పెషల్ రాళ్లతో ఫ్లోరింగ్ నిర్మాణానికి పోగుల మహేశ్వర్ రెడ్డి, చంద్రశేఖరమ్మ దంపతులు ముందుకు వచ్చారు. ఈ మేరకు ఒప్పంద పత్రాన్ని కర్నూలులోని వారి స్వగృహంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్. శ్రీనివాసరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా వేదపండితులు, అర్చకులు వేదాశీర్వచనం చేసి ప్రసాదం అందజేశారు. మహాశివరాత్రి కళ్యాణోత్సవం, కార్తీక పౌర్ణమి కోటి దీపోత్సవం వంటి విశిష్ట పర్వదినాల్లోతో పాటు అనేక సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు ఈ కళావేదికలో నిర్వహించబడుతుండటంతో ఈ ఫ్లోరింగ్ పనులు భక్తులకు మరింత సౌకర్యం చేకూర్చనున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ మధు పాల్గొన్నారు. క్షేత్ర అభివృద్ధికి ఇలాంటి సేవా భావంతో మరిన్ని దాతలు ముందుకు రావాలని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్. శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేశారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**